సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 16 । సెప్టెంబర్ । 2023



ముగిసిన దేహదారుఢ్య పరీక్షలు

ఎస్సై పోస్టుల భర్తీలో భాగంగా ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో అభ్యర్థులకు చేపట్టిన దేహదారుఢ్య పరీక్షలు ముగిశాయి.

IIలో ▸



కాపు మహిళలకు భరోసా

రాష్ట్రంలో కాపు మహిళలకు ప్రభుత్వం ఆర్థికంగా భరోసా కల్పిస్తోంది. ఏటా కాపునేస్తం పథకం కింద ఆర్థిక సాయం అందిస్తోంది.

IIలో ▸



మెరుగైన సేవలందించాలి

వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే విద్యుత్ శాఖ లక్ష్యమని విద్యుత్ గ్రీవెన్స్ ఫోరం చైర్‌పర్సన్ సత్యనారాయణ అన్నారు.

IIలో ▸

న్యూస్‌రీల్

ఇంజనీర్లు ప్రగతికి రూపశిల్పులు



ఏపీ నిట్‌లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: ఇంజనీర్లు దేశ ప్రగతికి రూపశిల్పులని ఏపీ నిట్ డీన్ అకడమిక్ టి.కురుమయ్య అన్నారు. శుక్రవారం నిట్‌లో ఇంజనీర్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. దేశ భవిష్యత్‌ను రూపొందించడంలో ఇంజనీర్ల కృషి వెలకట్టలేనిదని ఆయన అన్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లు, సంక్షోభాలకు పరిష్కారం చూపే వైవిధ్యభరితమైన ఆవిష్కరణలను చేపట్టడంతో పాటు వాటి ద్వారా అపారమైన అవకాశాలను సృష్టించాలని విద్యార్థులకు సూచించారు. మోక్షగుండం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వి.సందీప్, ఆచార్యులు డాక్టర్ టి.రమేష్, కిరణ్ తీపర్తి, రాముడు, తలారి రేష్మా, సుదర్శన దీప పాల్గొన్నారు.

ఉద్యోగుల గ్రీవెన్స్



వినతులు స్వీకరిస్తున్న డీఆర్వో కృష్ణవేణి

భీమవరం (ప్రకాశంచౌక్): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ దోహదపడుతుందని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) కె.కృష్ణవేణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఉద్యోగుల గ్రీవెన్స్‌లో భాగంగా ఆమె అర్జీలు స్వీకరించారు. సర్వీసు మేటర్స్, పెన్షన్ సమస్యలు, ఆర్థికపరమైన అంశాలు, క్రమశిక్షణ కేసులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ సమస్యలపై ప్రతి నెలా మూడో శుక్రవారం గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తామన్నారు. ఉన్నతాధికారులు అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎంప్లాయీ గ్రీవెన్స్‌లో 11 దరఖాస్తులు స్వీకరించారు. డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, జిల్లా ట్రెజరీ అధికారి ఎ.గణేష్, కలెక్టరేట్ ఏఓ వైకేవీ అప్పారావు పాల్గొన్నారు.

ముగిసిన కొత్త పెన్షన్ల పంపిణీ

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జిల్లాలో శుక్రవారంతో ముగిసింది. ఈ నెల 1 నుంచి 15 వరకూ కొత్త పెన్షన్ల పంపిణీని జిల్లావ్యాప్తంగా ఉత్సాహంగా నిర్వహించారు. జిల్లాలో 11,881 కొత్త పెన్షన్లు మంజూరు కాగా వీటి కోసం ప్రభుత్వం రూ.3.30 కోట్లు అదనంగా ఖర్చు చేయనుంది. మొత్తం జిల్లాలో 2,27,564 పెన్షన్లు ఉండగా వీటికి మొత్తంగా రూ.62.10 కోట్లు పంపిణీ చేశారు.

వైఎస్సార్ సీపీ జేసీఎస్ కో-ఆర్డినేటర్ల నియామకం



ఖండవల్లి వాసు, జేసీఎస్ కో-ఆర్డినేటర్



చెన్నప్రగడ శైలకుమార్, జేసీఎస్ కో-ఆర్డినేటర్

సాక్షి, భీమవరం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పశ్చిమగోదావరి జిల్లా జేసీఎస్ కో-ఆర్డినేటర్లుగా చెన్నప్రగడ శైలకుమార్, ఖండవల్లి వాసులను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది.

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తుల గడువు పొడిగింపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తుల గడువును ఈనెల 25 వరకు పొడిగించినట్లు డీఈఓ పి.శ్యామ్‌సుందర్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు బీఎస్ఈ ఏపీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రింటెడ్ నామినల్ రోల్స్, ధ్రువీకరణ పత్రాలను ఈనెల 28లోపు డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని, డిసెంబర్ 3న పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

బాల్య వివాహం నుంచి విముక్తి

ఏలూరు(మెట్రో): ఫేస్‌బుక్ ద్వారా కలెక్టర్‌కి వచ్చిన సమాచారం మేరకు బాల్య వివాహం నుంచి ఓ బాలికకు విముక్తి కలిగింది. స్థానిక చెంచుల కాలనీలో బాల్యవివాహానికి పెద్దలు పాల్పడుతున్నారనే సమాచారం మేరకు వెంటనే స్పందించిన కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ చర్యలు చేపట్టారు. బాలిక ఇంటికి వెళ్లి అధికారులు విచారణ చేసి వివాహ ప్రక్రియను నిలుపుదల చేయించారు. బాలికకు కలెక్టర్ సైకిల్, పుస్తకాలు అందించారు.

హేలాపురి.. వైద్య విద్యా సిరి

చరిత్రలో సువర్ణాధ్యాయం

- ఏలూరులో ప్రభుత్వ వైద్య కళాశాల
- వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం జగన్
- వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంపీ, ఎమ్మెల్యేలు





ఏలూరు మెడికల్ కళాశాలలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, దూలం నాగేశ్వరరావు, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, వైద్య కాలేజీలోని తరగతి గదిలో మొదటి బ్యాచ్ మెడికోలు

ఏలూరు టౌన్: ఏలూరు ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం సాకారమైంది. జిల్లా చరిత్రలో సువర్ణాధ్యాయం లిఖించబడింది. ఏలూరులోని ప్రభుత్వ వైద్య కళాశాలను శుక్రవారం లాంఛనంగా వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. విజయనగరంలోని గాజులరేగలో ప్రభుత్వ వైద్య కళాశాలను స్వయంగా ప్రారంభించిన ఆయన అక్కడి నుంచే ఏలూరుతో పాటు మరో మూడు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మీరంతా గొప్ప డాక్టర్లు కావాలనీ, సమాజంలో ప్రజలకు మీవంతు సేవలు అందించాలని మెడికోలకు సూచించారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా మార్పు చేసి, వాటిలో ఒక ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని స్పష్టం చేశారు.

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

ఏలూరు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ.. విద్య, వైద్య రంగాలకు ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యమిస్తున్నారని, నాడు–నేడు పేరిట విద్యా, వైద్యరంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన చూస్తే ఎంతో సంతోషంగా ఉందన్నారు. పోలవరం, జంగారెడ్డిగూడెం, చింతలపూడి వంటి మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఇప్పటివరకు ఈ ప్రాంతం ప్రజలు రాజమండ్రి, విజయవాడ వంటి సుదూర ప్రాంతాలకు మెరుగైన వైద్యం కోసం వెళ్లాల్సి వచ్చేదని, ఏలూరులో వైద్య కళాశాల, బోధనాస్పత్రి ఏర్పాటుతో పేదవర్గాలకు నాణ్యమైన వైద్యచికిత్సలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఏలూరు వైద్య కళాశాల 150 ఎంబీబీఎస్ సీట్లు కలిగి ఉందనీ, వైద్య కళాశాల నిర్మాణానికి రూ.525 కోట్ల భారీ వ్యయాన్ని ఖర్చు చేస్తున్నారన్నారు. ఏలూరు జిల్లా ప్రజల తరఫున సీఎం జగన్‌కు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు వైద్య విద్య చేరువ : ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటుచేసిన దివంగత సీఎం డాక్టర్ వైఎస్సార్ విగ్రహాన్ని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని ఆవిష్కరించారు. అనంతరం ఏలూరు వైద్య కళాశాల ప్రారంభ చిహ్నంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఏం కావాలో తెలుసుకుని మరీ వాటిని ఏర్పాటు చేస్తున్నారన్నారు. కేవలం ఉన్నత వర్గాలకు మాత్రమే అందుబాటులో ఉండే వైద్య విద్యను సాధారణ, మధ్యతరగతి వర్గాలకు చేరువ చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఇడా చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ దిరిశాల వరప్రసాదరావు, వడ్డీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ గాయత్రి సంతోషి, కో–ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్‌గురునాథ్, నగర కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, ఆర్డీఓ ఎస్ఎస్‌కే ఖాజావలి, ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీవీ విజయ్‌కుమార్, బోధనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శశిధర్, ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ సోమశేఖర్, కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

ఓటర్ల జాబితాపై ప్రత్యేక శ్రద్ధ

కలెక్టర్ ప్రశాంతి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

భీమవరం(ప్రకాశం చౌక్): ఎన్నికల సంఘ మార్గదర్శకాల మేరకు ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా–2024 తయారీకి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎన్నికలు, రెవెన్యూ అంశాలపై ఈఆర్‌ఓలు, తహసీల్దార్లతో ఆమె సమీక్షించారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణకు సంబంధించి చేర్పులు, మార్పులు, నమోదు, ఇంటింటి సర్వే, ఎపిక్ కార్డుల ప్రింటింగ్, పంపిణీ తదితర అంశాలపై సమీక్షించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల లేవనెత్తిన అంశాలపై త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో మూడో దశ రీ సర్వే పనులు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్, ఈ–డివిజనల్ పోస్టులకు ఆన్‌లైన్ పనులను శనివారం, డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టులకు ఆదివారం భీమవరం బీవీ రాజు ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. ఎక్కడా ఎటువంటి పొరపాట్లు జరగకుండా అధికారులు, సిబ్బంది జాగ్రత్తలు వహించాలని కలెక్టర్ ఆదేశించారు. డీఆర్వో కె.కృష్ణవేణి, ఆర్డీఓ దాసి రాజు తదితరులు పాల్గొన్నారు.

● ఆనందమనిపించెన్



కొయ్యలగూడెం మండలంలోని రాజవరం పంచాయతీ పరిధిలో నూతనంగా వైఎస్సార్ పింఛన్ కానుకకు అర్హత సాధించిన లబ్ధిదారులు శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సర్పంచుల చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏలేటి చినతుక్కయ్య ఆధ్వర్యంలో 70 మందికి సుమారు రూ.2 లక్షలు పింఛన్ సొమ్ముగా అందజేశారు. ఉప సర్పంచ్ అనంతల సుబ్బారావు, ఎంపీటీసీలు కొండేపాటి చింతయ్య, తమర్హి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

– కొయ్యలగూడెం

ఆరోగ్య సురక్షతో ఇంటింటికీ వైద్యం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకులో యూత్ వర్సెస్ గార్బేజీ కార్యక్రమంలో రోడ్లు ఊడుస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వైద్యసేవలు అందిస్తారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈనెల 30 వరకు గ్రామాల్లో సర్వే చేసి తద్వారా పేదల ఇంటికి వెళ్లి వైద్యసేవలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. చిన్నపాటి వ్యాధులు బాధితుల నిర్లక్ష్య ధోరణి కారణంగా పెద్ద వ్యాధులుగా ముదిరిపోతున్న నేపథ్యంలో రుగ్మతలను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. వైద్య బృందాలు ఇంటికి వచ్చిన సందర్భంగా వ్యాధి పరిష్కారం కాని పరిస్థితుల్లో మెరుగైన వైద్యసేవలకు పెద్ద ఆస్పత్రులకు తరలించే అవకాశం కూడా ఉందన్నారు.

చీపురు పట్టిన మంత్రి

ఇండియన్ స్వచ్ఛలీగ్ 2.0లో భాగంగా తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద నిర్వహించిన యూత్ వర్సెస్ గార్బేజీ కార్యక్రమంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చీపురు పట్టి రోడ్లు ఊడ్చారు. నియోజకవర్గ ప్రజలంతా స్వచ్ఛ సర్వేక్షన్‌కు సహకరించాలని ఆయన కోరారు. ప్రతిఒక్కరూ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ కేటీ సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యులు, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ నత్త కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, తణుకు మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందర రామరాజు, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, తణుకు నియోజకవర్గ పరిశీలకులు జక్కంశెట్టి సత్యరాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు త్వరితగతిన చర్యలు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ. చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి

తాడేపల్లిగూడెం అర్బన్: సమీక్షా సమావేశంలో చర్చించిన అభివృద్ధి కార్యక్రమాలను త్వరితగతిన నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక బలుసులమ్మవారి కళ్యాణ మండపంలో కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షతన శుక్రవారం జిల్లా అధికారులతో నియోజకవర్గ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ గృహ నిర్మాణాల ప్రగతిని వేగిరపర్చాలన్నారు. మెట్ట ఉప్పరగూడెం ఎస్టీ, బి.కొండేపాడు ఎస్సీ కాలనీవాసులకు నూతన గృహాల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలన్నారు. అలాగే స్థలాలకు దరఖాస్తు చేసుకున్న వారికి 90 రోజుల్లో పరిష్కారం చూపాలన్నారు. టిడ్కో ఇళ్ల పనులను వేగిరపర్చి అక్టోబర్ నాటికి పూర్తిస్థాయిలో అందజేయాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను మార్పు చేయాలని, రోడ్లకు స్పాట్‌హోల్స్‌ను వెంటనే పూడ్చడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

క్షేత్రస్థాయిలో సమీక్షించి..

కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి నియోజకవర్గ సమావేశం దోహదపడుతుందన్నారు. 17 అజెండా అంశాలపై వివిధ శాఖల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆమె సమీక్షించారు. గృహ నిర్మాణంపై సమీక్షిస్తూ తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల పరిధిలో సొంత స్థలాల్లో గృహాలు నిర్మించుకున్న 1,022 గృహాలకు, 90 రోజుల ప్రోగ్రామ్‌లో ఇచ్చిన 246 పట్టాలు మొత్తం 1,268 గృహాల మంజూరుకు ప్రతిపాదించారు. తాడేపల్లిగూడెం రూరల్, పెంటపాడు మండలాల్లో జగనన్న లేఅవుట్‌లలో అంతర్గత రోడ్లు, మరమ్మతుల పనులు మంజూరు చేయాలని, కోరుమిల్లి లేఅవుట్‌లో స్థలం మెరక, తాడేపల్లిగూడెంలో సొంత స్థలాల్లో నిర్మించుకున్న 150 ఇళ్ల మంజూరు, పట్టణ ప్రాంతాల్లోని లేఅవుట్లలో అంతర్గత రోడ్ల నిర్మాణం, ఇందిరమ్మ పథకంలో జీప్లస్–1 పద్ధతిలో నిర్మించిన గృహాల మరమ్మతులు తదితర అంశాలపై చర్చించారు. బోడపాడు నుంచి రావిపాడు మధ్య కల్వర్టు మంజూరు, బిళ్లగుంట గ్రామం వరకు రూ.1.15 కోట్ల అంచనాతో మంజూరైన రహదారి పూర్తి చేయాలని, పెంటపాడు మండలలో హెల్త్ క్లినిక్ భవన నిర్మాణానికి అదనంగా రూ.3 లక్షలు మంజూరు చేయాలని, 134 పంచాయతీరాజ్ శాఖ పనులకు రూ.4.49 కోట్లు మంజూరు చేయాలని తీర్మానించారు. ఆర్డీఓ దాసి రాజు, జెడ్పీ సీఈఓ రవికుమార్, డీఎస్పీ కె.నివాసరావు, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కైకాల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పి.శేషులత పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష

జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్లను కలెక్టర్‌తో కలిసి మంత్రి కొట్టు సత్యనారాయణ ఆవిష్కరించారు. డీఎంహెచ్ఓ డి. మహేశ్వరరావు, పగడాల సూర్యనారాయణ, కర్రి భాస్కరరావు పాల్గొన్నారు.

బడ్జీలకు పదోన్నతులు.. బదిలీలు

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో వివిధ కోర్టుల్లో పనిచేస్తున్న జడ్జిలకు పదోన్నతులు, బదిలీలు జరిగాయి. హైకోర్టు రిజిస్ట్రార్ రాష్ట్ర వ్యాప్తంగా జడ్జిల పదోన్నతులు, బదిలీలు చేస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులను విడుదల చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా పనిచేస్తున్న జి.రాజేశ్వరిని ఐదో అడిషనల్ జిల్లా, సెషన్స్ జడ్జి కమ్ మహిళల స్పెషల్ కోర్టు జడ్జిగా నియమించారు. ఇప్పటివరకూ అక్కడి పోస్టు ఖాళీగా ఉంది. కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న డి.సత్యవతిని తణుకు 4వ అడిషనల్ జిల్లా, సెషన్స్ జడ్జిగా నియమించారు. కాకినాడలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరావును కొవ్వూరు 9వ అడిషనల్ జిల్లా, సెషన్స్ జడ్జిగా నియమించారు.

నేడు హైకోర్టు న్యాయమూర్తి రాక

ఏలూరు (టూటౌన్): హైకోర్టు న్యాయమూర్తి రఘునందనరావు శనివారం ఏలూరు జిల్లా కోర్టుకు రానున్నారని హైకోర్టు ప్రొటోకాల్ రిజిస్ట్రార్ ఏవీ రాఘవస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు జిల్లా కోర్టులో జరిగే వర్క్‌షాప్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఏలూరు నుంచి ఉండవల్లికి బయలుదేరతారని పేర్కొన్నారు.

హైవే బాధితులకు ఊరట

భీమవరంలో ఆప్షన్ 10సీ నోటిఫికేషన్ రద్దు



భీమవరంలో లంకపేట ఎస్సీ కాలనీ

భీమవరం (ప్రకాశంచౌక్): జాతీయ రహదారి–165 (పామర్రు–దిగమర్రు)కు సంబంధించి భీమవరంలో ఆప్షన్ 10సీగా లంకపేట ఎస్సీ కాలనీ నుంచి వీరవాసరం మండలం పెర్కిపాలెం మీదుగా హైవే నిర్మాణానికి జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ హైకోర్టు ఈనెల 14న తీర్పు చెప్పింది. దీంతో భీమవరం లంకపేట ఎస్సీ కాలనీతో పాటు పెర్కిపాలెం ప్రజలకు ఊరట కలిగింది. ఎన్‌హెచ్–165 ఫేజ్–2లో ఆకివీడు నుంచి దిగమర్రు వరకు సుమారు 67 కిలోమీటర్ల మేర రహదారి ఉంది. దీనిలో భాగంగా భీమవరానికి సంబంధించి బైపాస్ రోడ్డు 80 అడుగుల వెడల్పుతో ఉంది. ఇందులో వంతెనలు, కల్వర్టులు ఉన్నాయి. మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు హైవే అథారిటీ ఆప్షన్ 10ఏగా ఈ రోడ్డును ఆమోదించింది. అలాగే ఆప్షన్ 10బీగా పీపీ రోడ్డు ఉంది. 2017 ఫిబ్రవరి 13న బైపాస్ రోడ్డును అప్రూవల్ చేసింది. అయితే ఆప్షన్ 10సీగా లంకపేట ఎస్సీ కాలనీ నుంచి పెర్కిపాలెం మీదుగా హైవే రోడ్డు నిర్మించడానికి 2017 నవంబర్ 8న మరో నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిపై స్థానిక ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేశారు. 2018 మే 26న సాంకేతిక బృందం భీమవరంలో పర్యటించి ఆప్షన్ 10ఏ అప్రూవల్ ఉన్న బైపాస్‌ను గ్రీన్‌ఫీల్డ్ హైవేగా చేసుకోవచ్చని నివేదిక సమర్పించింది. అయినా హైవే అధికారులు పట్టించుకోకుండా 10సీ నోటిఫికేషన్ జారీ చేశారు. దీనిపై అప్పట్లో 254 మంది అభ్యంతరాలు తెలిపారు. అయినా పట్టించుకోకపోవడంతో 79 మంది బాధితులు 2018 అక్టోబర్‌లో హైకోర్టులో పిటీషన్ వేశారు.

ఐదేళ్ల పోరాటం అనంతరం..

హైకోర్టులో ఐదేళ్లపాటు సుదీర్ఘ పోరాటం చేయగా బాధితులకు అనుకూలంగా ఈనెల 14న హైకోర్టు తీర్పు ఇస్తూ 10సీ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ ఎంఓఆర్‌టీహెచ్ అప్రూవల్ ఉన్న రోడ్లను ఉపయోగించుకోవాలని తీర్పు ఇచ్చింది. దీంతో 400 మంది పేదలకు ఊరట లభించింది. హైవే విస్తరణ నుంచి భీమవరం లంకపేట ఎస్సీ కాలనీ, వీరవాసరం మండలం పెర్కిపాలెంలో పేదల ఇళ్లు బయటపడ్డాయి. జాతీయరహదారి పట్టణం వెలుపల నుంచి వెళితే పట్టణాభివృద్ధికి దోహదపడుతుందని, భీమవరం పట్టణానికి బయట ఉన్న పుంత రోడ్ల నుంచి హైవే నిర్మిస్తే ఇబ్బంది ఉండదని, అలాగే ఖర్చు తగ్గుతుందని 2016లో అప్పటి హైవే డీఈకి పట్టణ ప్రముఖులు తెలియజేశారు.

హర్షం వ్యక్తం చేస్తున్న బాధితులు

హైకోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో లంకపేట వాసులు, పెర్కిపాలెం వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సామాన్యులైన తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తీర్పు ఇచ్చిన కోర్టుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

క్లుప్తంగా

పెరుగుతున్న గోదావరి వరద

పోలవరం రూరల్: గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు గోదావరి వరద నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 30.510 మీటర్ల వద్ద నీటిమట్టం కొనసాగుతోంది. స్పిల్‌వే 49 గేట్ల నుంచి దిగువకు 5,76,727 క్యూసెక్కుల వరద నీరు దిగువకు చేరుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహం వల్ల నీటిమట్టం మరికొంత పెరిగే అవకాశం ఉందని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.

లారీని ఢీకొన్న ప్రైవేట్ బస్సు

డ్రైవర్ మృతి, ప్రయాణికులకు స్వల్ప గాయాలు

ఏలూరు టౌన్: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొనటంతో బస్ డ్రైవర్ మృతిచెందగా, 20 మంది ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. ఈ రోడ్డు ప్రమాదం ఏలూరు జాతీయ రహదారిలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. కావేరి ట్రావెల్స్‌కు చెందిన ఏసీ బస్సు హైదరాబాద్ నుంచి 30 మంది ప్రయాణికులతో కాకినాడకు బయల్దేరింది. ట్రావెల్స్ బస్సు ఏలూరు జాతీయ రహదారిలోని కలపర్రు టోల్‌ప్లాజా సమీపంలోకి చేరుకునేసరికి ముందుగా వెళ్తున్న లారీ డ్రైవర్ హఠాత్తుగా బ్రేక్ వేశాడు. వెనుక వస్తున్న ట్రావెల్స్ బస్సు లారీని వెనుకనుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు ముందుభాగం దెబ్బతింది. బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 అంబులెన్స్‌లో ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. 20 ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రయాణికులు ఆయా బస్సుల్లో తమ గమ్యస్థానాలకు వెళ్ళిపోయారు. బస్సు డ్రైవర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకలగన్నవరం గ్రామానికి చెందిన అల్లాడ వెంకట నారాయణమూర్తి (44)గా గుర్తించారు. ఈ ప్రమాదంపై పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాపు మహిళలకు భరోసా

- నేడు కాపు నేస్తం నాలుగో విడత నిధులు విడుదల
- నిడదవోలులో సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 55,224 మందికి రూ.82.83 కోట్ల లబ్ధి

ఏలూరు (టూటౌన్)/భీమవరం(ప్రకాశం చౌక్): రాష్ట్రంలోని కాపు మహిళలకు ప్రభుత్వం ఆర్థికంగా భరోసా కల్పిస్తుంది. రాష్ట్రంలోని కాపు, ఒంటరి, తెలగ, బలిజ సామాజిక వర్గాలకు చెందిన మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ కాపు నేస్తం పథకం ప్రవేశ పెట్టింది. ఈ పథకంలో ఇప్పటి వరకూ మూడు విడతలుగా లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా నగదు జమ చేశారు. తాజాగా కాపు నేస్తం పథకంలో నాలుగో విడత నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 16న తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కాపు నేస్తం నాలుగో విడత సొమ్ములను లాంఛనంగా విడుదల చేయనున్నారు. అర్హులైన ఒక్కో మహిళ ఖాతాలో రూ.15 వేల చొప్పున జమచేయనున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల వ్యాప్తంగా 55,224 మంది కాపు మహిళలకు రూ.82.83 కోట్ల మేరకు లబ్ధి చేకూరనుంది.



కాపు నేస్తం లబ్ధిదారులు(ఫైల్)

ఐదేళ్ళలో రూ.75 వేల ఆర్థిక సాయం

కాపు నేస్తం పథకంలో భాగంగా 2020 నుంచి 2024 వరకూ ఐదేళ్ల పాటు ఆయా వర్గాలకు చెందిన 45 నుంచి 60 సంవత్సరాల వయసున్న మహిళలకు ఏడాదికి రూ.15 వేల చొప్పున మొత్తం రూ.75 వేలు అందించనున్నారు. ఇప్పటికే మూడు విడతల్లో రూ.45 వేలను ప్రభుత్వం అందించింది. తాజాగా నాలుగో విడతలో నిధులను లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా జమచేయనున్నారు. దీంతో కాపు, ఒంటరి, తెలగ, బలిజ మహిళలకు ఇప్పటి వరకూ వరుసగా నాలుగేళ్లలో రూ.60 వేల చొప్పున కాపు నేస్తం పథకంలో ఆర్థిక సహకారాన్ని ప్రభుత్వం అందించింది.

పశ్చిమగోదావరి జిల్లాలో రూ.53.04 కోట్ల లబ్ధి

కాపు నేస్తం నాలుగో విడతలో పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 35,358 మంది మహిళలకు రూ.53.04 కోట్ల మేరకు లబ్ధి చేకూరనుంది. ఈ జిల్లాలో తొలి విడతలో 34,385 మందికి రూ.51.58 కోట్లు, రెండో విడతలో 30,766 మందికి రూ.46.15 కోట్లు, మూడో విడతలో 32,831 మందికి రూ.49.25 కోట్ల మేర ప్రయోజనం చేకూరింది.

ఏలూరు జిల్లాలో రూ.29.79 కోట్ల ప్రయోజనం

ఏలూరు జిల్లా వ్యాప్తంగా మొత్తం 19,866 మందికి మొత్తం రూ.29.79 కోట్ల మేరకు ప్రయోజనం చేకూరనుంది. ఈ జిల్లాలో తొలివిడతలో 16,533 మందికి రూ.24.80 కోట్లు, రెండో విడతలో 19,185 మంది మహిళలకు రూ.28.78 కోట్లు, మూడో విడతలో 18,340 మందికి రూ.27.51 కోట్ల మేరకు ఆర్థిక సహాయం అందించారు.

ఏలూరు జిల్లాలో

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	పొందిన లబ్ధి(రూ.కోట్లలో)
2020-21	16,533	24.80
2021-22	19,185	28.78
2022-23	18,340	27.51
2023-24	19,866	29.79

పశ్చిమగోదావరిలో..

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	పొందిన లబ్ధి(రూ.కోట్లలో)
2020-21	34,385	51.58
2021-22	30,766	46.15
2022-23	32,831	49.25
2023-24	35,358	53.04

అర్హులందరికీ కాపు నేస్తం లబ్ధి



వైఎస్సార్ కాపు నేస్తం పథకంలో కాపు, ఒంటరి, తెలగ, బలిజ సామాజిక వర్గాలకు చెందిన మహిళలకు ఆర్థిక లబ్ధి చేకూరుస్తున్నాం. నేడు నాలుగో విడత కాపు నేస్తం నిధులను విడుదల చేయనున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో 55,224 మంది మహిళలకు రూ.82.83 కోట్ల మేరకు లబ్ధి చేకూరనుంది.

ఎస్.పుష్పలత, ఈడీ, కాపు/బీసీ కార్పొరేషన్, ఏలూరు

కాపు మహిళలకు ఆర్థిక భరోసా



కాపు నేస్తం పథకం ద్వారా ఏటా రూ.15 వేల చొప్పున అందించడంతో మాకు పూర్తి ఆర్థిక భరోసా కలిగింది. చిన్న పాటి అవసరాలకు ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం ఉండటం లేదు. సొంతంగా చిరు వ్యాపారాలు చేసుకునే అవకాశం దక్కింది. కాపు మహిళలకు అండగా ఉంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ధన్యవాదాలు.

పసుపులేటి రమాదేవి, కాపునేస్తం లబ్ధిదారురాలు, 42వ డివిజన్, ఏలూరు

సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు



కాపు నేస్తం పథకం ద్వారా ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఆర్థిక సాయాన్ని అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు. ఇప్పటికే మూడు విడతల్లో రూ.15 వేల చొప్పున రూ.45 వేలు ఆర్థిక సాయాన్ని అందుకున్నాం. తాజాగా నాలుగో విడత నిధులు రానుండటం ఎంతో సంతోషంగా ఉంది.

కోగంటి సరస్వతి, కాపు నేస్తం లబ్ధిదారురాలు, 42వ డివిజన్, ఏలూరు

ఆర్థికంగా భరోసా



ప్రభుత్వం కాపు నేస్తం పథకంలో మూడు విడతలుగా రూ.45 వేలు ఆర్థిక సాయం అందించింది. నాల్గో విడత సాయంగా మరో రూ.15 వేలు ఇస్తున్నారు. సీఎం ఇచ్చిన హామీ నిలబెట్టుకుని క్రమం తప్పకుండా ప్రతి ఏడాది ఆర్థిక సాయం చేయడం చాలా సంతోషం. కాపు నేస్తం కింద ఇచ్చే ఆర్థిక సాయం చాలా ఉపయోగపడుతుంది.

కుర్మెళ్ల వెంకటలక్ష్మి, గొల్లవానితిప్ప

చవితి వేడుకల్లో నిబంధనలు పాటించాలి

పర్యావరణ విభాగం ఇంజినీర్ కె.వెంకటేశ్వరరావు



ఏలూరు (ఆర్ఆర్‌పేట): సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలకు లోబడి వినాయక విగ్రహాల తయారీ, నిమజ్జనం కార్యక్రమాలు ఉండాలని ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జిల్లా పర్యావరణ ఇంజినీర్ కే.వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు తయారీ, అమ్మకాలు నిషేధమని.. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా తయారు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. 100 విగ్రహాలకు పైగా తయారు చేసేవారు కచ్చితంగా రిజిస్ట్రేషన్ చేసుకుని, ట్రేడ్ లైసెన్స్ పొందాలన్నారు. మట్టి విగ్రహాలను మాత్రమే వాడాలని, అవి కూడా మూడు అడుగులు కంటే తక్కువ ఎత్తు కలిగిఉండాలన్నారు. గణేష్ ఉత్సవాల మండపాలకు అనుమతులు ఇచ్చేటప్పుడు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. బాణసంచా కాల్చడం, పెద్ద పెద్ద శబ్దాలతో మైకులను ఏర్పాటు చేయడం చేయకూడదన్నారు. వినోద కార్యక్రమాలలో అశ్లీలత, డాన్సులకు తావులేకుండా సంప్రదాయబద్ధంగా ఉండాలన్నారు. విగ్రహాలు తయారుచేసే ప్రదేశాలపై పోలీస్, రెవెన్యూ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తనిఖీలు ఉంటాయన్నారు. రహదారులకు అడ్డంగా విగ్రహాల ఏర్పాటు చేయకూడదన్నారు. పర్మిషన్ ఇచ్చేటప్పుడు విగ్రహాల ఎత్తును తప్పనిసరిగా పరిగణలోనికి తీసుకోవాలన్నారు. పోలీస్ శాఖ నుంచి సౌండ్ సిస్టం పర్మిషన్ తప్పనిసరి అన్నారు. విగ్రహాల నిమజ్జనానికి తేదీలు, సమయం ముందుగానే పందిళ్ళ నిర్వాహకులకు తెలియజేయాలన్నారు. నిమజ్జనాల సమయంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ముందుగానే ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. మున్సిపల్, పరిశ్రమలు శాఖలు పెద్ద ఎత్తున మట్టి విగ్రహాలు పంపిణీ చేయాలన్నారు. నిమజ్జనాల రోజుల్లో వివిధ కూడళ్ళలో మెడికల్ క్యాంపులు, అంబులెన్స్‌లను ఏర్పాటు చేయాలని ఆరోగ్య శాఖకు సూచించారు. అన్ని పంచాయతీల్లో, మున్సిపాలిటీలో పర్యావరణ విగ్రహాల తయారీ, వినియోగాలపై అధికారులతో సమావేశాలను ఏర్పాటుచేసి చర్యలు తీసుకోవాలన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

పెదవేగి: పెదవేగి మండలం కొండలరావుపాలెంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించి నలుగురి నుంచి రూ.1,9740 నగదు, 8 మోటారు సైకిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపారు. కొప్పాకలో పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.6 వేలు, 3 మోటార్ సైకిళ్ల స్వాధీనం చేసుకున్నారు.



ముగిసిన ఎస్సై దేహదారుఢ్య పరీక్షలు

ఏలూరు రేంజ్‌లో 5411 మందికి అర్హత

ఏలూరు టౌన్: ఎస్సై పోస్టుల భర్తీలో భాగంగా మొదటి విడత ప్రాథమిక అర్హత పరీక్షలు గతంలో పూర్తికాగా... తాజాగా దేహదారుఢ్య పరీక్షలు పూర్తిచేశారు. తుది దశ రాత పరీక్షకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. ఎస్సై పోస్టుల దేహదారుఢ్య పరీక్షలను ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో పకడ్బందీగా నిర్వహించారు. ఆగస్టు 25 నుంచీ సెప్టెంబర్ 15 వరకూ ఫిజికల్ పరీక్షలు నిర్వహించి.. సత్తా చాటిన అభ్యర్థులను తుది దశ పరీక్షలకు ఎంపిక చేశారు. ఏలూరు రేంజ్‌లో దేహదారుఢ్య పరీక్షలకు 9686 మంది అభ్యర్థులు పోటీ పడగా 5411 మంది తుది పరీక్షకు ఎంపికయ్యారు. ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అంతా తానై పరీక్షలను పర్యవేక్షించారు. దేహదారుఢ్య పోటీలు, స్క్రీనింగ్ టెస్ట్‌లు, సర్టిఫికెట్ల పరిశీలన ఇలా ప్రతీ అంశాన్ని దగ్గరుండి పరిశీలించారు. అభ్యర్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పనలో జాగ్రత్తలు తీసుకున్నారు.

తుదిదశ పరీక్షకు 5411 మంది అభ్యర్థులు

ఎస్సై పోస్టులకు ఆఖరి పరీక్షలకు ఏలూరు రేంజ్ పరిధిలో 5411 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. వీరిలో పురుషులు 4797 మంది ఉండగా, మహిళా అభ్యర్థులు 614 మంది ఉన్నారు. వీరంతా తుది పరీక్షలకు హాజరై తమ ప్రతిభను నిరూపించుకోవాల్సి ఉంటుంది.

కట్టుదిట్టమైన భద్రతా చర్యలు

ఏలూరు రేంజ్ పరిధిలో ఎస్సై పోస్టుల భర్తీ ప్రక్రియలో పోలీస్ ఉన్నతాధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి, పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ ఉప్పాడ రవిప్రకాష్, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ శ్రీధర్, కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, కృష్ణాజిల్లా ఎస్పీ పీ.జాషువా, ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, పశ్చిమ అదనపు ఎస్పీ ఏవీ సుబ్బరాజు ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఏలూరు పరేడ్ గ్రౌండ్స్‌లో దేహదారుఢ్య పరీక్షల్లో భాగంగా పరుగు పోటీలను పర్యవేక్షిస్తోన్న డీఐజీ అశోక్‌కుమార్

ఏలూరు రేంజ్‌లో మొత్తం అభ్యర్థులు	- 9,686
పరీక్షలకు హాజరుకావాల్సిన పురుష అభ్యర్థులు	- 8,247
పరీక్షలకు హాజరైన పురుష అభ్యర్థులు	- 6,763
తుది పరీక్షలకు అర్హత సాధించిన పురుష అభ్యర్థులు	- 4,794
పరీక్షలకు హాజరుకావాల్సిన మహిళా అభ్యర్థులు	- 1,439
పరీక్షలకు హాజరైన మహిళా అభ్యర్థులు	- 1,195
తుది పరీక్షలకు అర్హత సాధించిన మహిళా అభ్యర్థులు	- 614

పారదర్శకంగా పరీక్షలు

ఏలూరు రేంజ్ పరిధిలో దేహదారుఢ్య పరీక్షలను నిష్పక్షపాతంగా చేపట్టాం. అభ్యర్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాం. ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తితే తక్షణం వైద్య సేవలు అందించేలా వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాం. మహిళా అభ్యర్థులకు పోటీలను మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది పర్యవేక్షణలో చేపట్టాం.

జీవీజీ అశోక్‌కుమార్, ఏలూరు రేంజ్ డీఐజీ

● గడపగడపకు సంక్షేమం



పెంటపాడు: మండలంలోని అలంపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పథకాలు వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



వీరవాసరం: మడుగు పోలవరంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

మట్టి వినాయకుడినే పూజించండి

పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: వినాయకచవితి మహోత్సవాల్లో పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి ప్రతిమలకే పూజాధికాలు నిర్వహించాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. తణుకు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం కమిషనర్ కేటీ సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కారుమూరి ప్రజలకు మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతోపాటు వివిధ రంగులు అద్దిన విగ్రహాలు పర్యావరణానికి హాని కలిగిస్తాయని చెప్పారు. ఈ వినాయక చవితికి ప్రజలంతా మట్టి వినాయక ప్రతిమలే ఉపయోగించి పూజాధికాలు జరుపుకోవాలని సూచించారు. ఈ రెండు రోజుల్లో 6 వేల మట్టి వినాయక ప్రతిమలు భక్తులకు అందచేస్తామని చెప్పారు. ఏ శుభకార్యం తలపెట్టినా ముందుగా గణపతి పూజకే ప్రాధాన్యతనిస్తామని అలాంటి గణనాథుడు ప్రజలందరినీ చల్లగా చూడాలని కోరుకుంటున్నట్లు వివరించారు. ముందుగా యూత్ వర్సెస్ గార్బేజీ కార్యక్రమంలో భాగంగా ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల నుంచి పాల్గొన్న విద్యార్థుల ర్యాలీని మంత్రి కారుమూరి జెండా ఊపి ప్రారంభించారు. ప్రజలందరికీ మట్టి వినాయక ప్రతిమతోపాటు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు చినిమిల్లి వెంకటరాయుడు, వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, తణుకు నియోజకవర్గ పరిశీలకులు జక్కంశెట్టి సత్యరాజేంద్రప్రసాద్, సప్పా బలరామకృష్ణ, గుబ్బల సూర్యచంద్రరావు, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు, మునిసిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.



మట్టి గణపతి ప్రతిమలు అందిస్తున్న మంత్రి కారుమూరి

న్యాయమూర్తిపై అసత్య ప్రచారం సహించేది లేదు

గీత కులాల సమాఖ్య నాయకులు

భీమవరం(ప్రకాశం చౌక్): న్యాయమూర్తి హిమబిందుపై అసత్య ప్రసారం చేస్తే సహించేది లేదని గౌరవ ప్రధానమైన వృత్తిలో ఉన్న ఒక మహిళను సోషల్ మీడియాలో కించపర్చడం తీవ్రంగా ఖండిస్తున్నామని గౌడ, శెట్టిబలిజ, శ్రీ శైన, యాత సమాఖ్య జిల్లా అధ్యక్షుడు వేంద్ర వెంకటస్వామి అన్నారు. శుక్రవారం భీమవరంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు ఏసీబీ కోర్టులో 14 రోజులు రిమాండ్ విధిస్తూ విధులను బాధ్యతగా నేరవేర్చిన న్యాయమూర్తి హిమబిందుపై టీడీపీ శ్రేణులు సోషల్ మీడియా ద్వారా కక్ష సాధింపు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కక్ష సాధింపులను గీత వృత్తి సంఘం ద్వారా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జడ్జిపై అసభ్యకరంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారిని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కోర్టులలో జడ్జిలుగా బీసీలు ఉండకూడదని గతంలో చంద్రబాబు వ్యవహరించారన్నారు. జడ్జి హిమబిందు గురించి తెలియని వారు సైతం మరొకరి ఫొటో సోషల్ మీడియాలో పెట్టి చెడు ప్రచారం చేస్తున్నారన్నారు. టీడీపీకి చెందినవారు, ఇతరులు కొందరు న్యాయమూర్తి హిమబిందు ఇచ్చిన తీర్పును అనుమానిస్తూ ఆమెను సైతం రాజకీయలల్లోకి లాగుతున్నారని.. ఇది సరైన పద్ధతి కాదన్నారు. సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు తీసివేయాలని లేని పక్షంలో తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గౌడ, శెట్టిబలిజ నాయకులు పాక సత్యనారాయణ, కామన నాగేశ్వరరావు, గూడూరి ఉమాబాల మాట్లాడుతూ న్యాయమూర్తి హిమబిందు నిష్పాక్షికంగా తీర్పు ఇస్తే ఆమెపై తప్పుడు ఆరోపణలు చేయడం దారుణమన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం ఆపకపోతే చట్టరీత్యా చర్యలకు ముందుకు వెళ్తామని హెచ్చరించారు. సమావేశంలో జెడ్పీటీసీ కాండ్రేగుల నర్సింహరావు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడే యుగంధర్, నాయకులు వీరవల్లి శ్రీనివాస్, కోమటి రవి కుమార్, చెల్లబోయిన సూర్యప్రకాష్, మల్లుల శ్రీనివాసరావు, కట్టా రవి, బొక్కా గోపి, చెల్లంకి గిరి, వీరవల్లి సుబ్బారావు, సుబ్బు, గుబ్బల చిన్ని, కేతా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న గీత వృత్తి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు వేంద్ర వెంకటస్వామి, తదితరులు

వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి

పెదవేగి: వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే విద్యుత్ శాఖ లక్ష్యమని, ఈ విషయంలో వినియోగదారులకు సమస్యలు ఎదురైతే వినియోగదారులు గ్రీవెన్స్ ఫోరంను సంప్రదించవచ్చని గ్రీవెన్స్ ఫోరం చైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ అన్నారు. పెదవేగి విద్యుత్ ఉప కేంద్రం ఆవరణలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక శుక్రవారం నిర్వహించారు. ఈ సదస్సులో పలువురు వినియోగదారులు తమ సమస్యలను అధికారులకు విన్నవించారు. తనకున్న వ్యవసాయ మోటారుకు ఉచిత విద్యుత్ సరఫరాను తొలగించారని గార్లమడుగు గ్రామానికి చెందిన మేడికొండ శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. దీనిపై వివరణ ఇవ్వాలని విద్యుత్ అధికారులను కోరగా.. వారు సమాధానం ఇవ్వకపోవడంతో రైతుకు సంబంధించిన మోటారుకు సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఫోరం సభ్యులు డాక్టర్ ఆర్.సురేంద్రకుమార్, డీఈఈలు ఎం.రూన్సీ, టి.శశిధర్, పెదవేగి ఏడీ శ్రీనివాస్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం దుగ్గిరాలలోని ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులతో సమావేశమైన ఫోరమ్ చైర్‌పర్సన్, సభ్యులు విద్యుత్ వినిమయం, సరఫరాలో సమస్యలపై చర్చించారు.

రైలు కింద పడి యువతి ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఏలూరు నిమ్మకాయల యార్డ్ రైల్వే గేటు వద్ద రైలుకింద పడి యువతి గురువారం ఆత్మహత్య చేసుకుంది. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంకు చెందిన మండాది సాయిలక్ష్మికి(31) వివాహం కాలేదు. తండ్రి మూడేళ్ల క్రితం మృతిచెందారు. తండ్రి లేకపోవడం, ఆర్థిక సమస్యలు, ఉద్యోగం లేక జీవనం ఇబ్బందిగా మారడంతో మానసిక వేదనకు గురైంది. ఈనెల 14న తన గ్రామం నుంచి బయలుదేరి ఏలూరు చేరుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని శుక్రవారం మృతురాలి బంధువులకు అప్పగించారు.



సాయిలక్ష్మి (ఫైల్)

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- అలంపురంలో ముగిసిన గడపగడపకు మన ప్రభుత్వం
- 70 మందికి పైగా ఇళ్ల పట్టాల పంపిణీ



పెంటపాడు మండలం అలంపురంలో గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పథకాలు వివరిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అలంపురం గ్రామంలో ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రజలందరికి ఏదో ఒక లబ్ధి చేకూర్చడంతో పాటు, ఇప్పటి వరకు ఏ సీఎం చేయలేని చరిత్రను జగనన్న సృష్టించారన్నారు. ఇది ప్రతిపక్షాలకు కంటగింపుగా ఉందన్నారు. సీఎం జగనన్న పాదయాత్ర చరిత్రలో సువర్ణాయంగా నిలిస్తే నేడు లోకేష్ యువగళం యాత్ర రక్తపాతయాత్రగా చరిత్ర కెక్కిందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుల ఫ్లెక్సీలను చింపేయమని లోకేష్ చెప్పడంతో యువగళం ముసుగులో ఉన్న బౌన్సర్లు వైఎస్సార్ సీపీ నాయకులపై మందపర్రు, నల్లజర్ల, భీమవరం ప్రాంతాల్లో దాడులకు పాల్పడ్డారన్నారు. గత ప్రభుత్వ కాలంలో టీడీపీ అధినేత అధికారం అడ్డుపెట్టుకొని చంద్రబాబు భారీ కుంభకోణంకు పాల్పడటం అవివేకమన్నారు. మరో పక్క అమరావతి పేరున భారీ కుంభకోణం జరిగిందన్నారు. చంద్రబాబు అరెస్టు వెనుక ప్రభుత్వ తొందరపాటు, ప్రతీకారం, కక్ష్య వంటివి లేవన్నారు. ప్రశ్నించడానికే పార్టీ పెట్టానని చెబుతున్న పవన్ కల్యాణ్ అప్పట్లో చంద్రబాబు అవినీతిని ప్రశ్నించకపోవడం వల్లనే చంద్రబాబుకు నేడు ఈ స్థితి దాపురించిందన్నారు. స్థిరత్వం లేని పవన్ కల్యాణ్ రోజుకో మాట పలుకుతూ నేటికి అసలు విషయం బయటపడిందన్నారు. ప్రజల పక్షాన ఉంటానన్న జనసేన నేత పవన్ ప్రస్తుతం చంద్రబాబు పక్షాన నిలబడి ఆయన అరెస్టును ఖండించడం సిగ్గుచేటన్నారు. సీఎం జగనన్న పాదయాత్రలో ఇచ్చిన హామీలు నూరుశాతం అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అలంపురం సొసైటీ అధ్యక్షుడు కొలనువాడ సత్యనారాయణరాజు (దత్తుడు) దెందుకూరి సూర్యనారాయణరాజు (సూరిబాబు) క్షేపల్లి గాంధీరాజు, కొలనువాడ సీతారామరాజు, చిన్నం గణపతి, మాజీ ఎంపీటీసీ సభ్యులు బీరా వెంకటరత్నం, రాపాక కుమారి పెనుమర్తి తాతారావు, సొసైటీ సభ్యులు పి. కాశీ, పెనుమర్తి మురళి, కోటిచుక్కల శ్రీను, దైవసహాయం, పార్టీ ఎంపీపీ దాసరి హైమావతి, పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపదరావు కృష్ణారావు, అడ్వకేట్ హరిదాసు రవీంద్ర, ములగాల బాబ్జి, పలు గ్రామాల పార్టీ నాయకులు పలు గ్రామాల పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అలంపురంలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ

పెంటపాడు: అలంపురం గ్రామంలో గడపగడప కార్యక్రమంలో భాగంగా సుమారు 70 మందికి పైగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను మంత్రి చేతులమీదుగా పంపిణీ చేశారు. దీంతో లబ్ధిదారులు మంత్రి కొట్టు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి హైమావతి , గ్రామ సొసైటీ అధ్యక్షుడు కొలనువాడ సత్యనారాయణరాజు (దత్తుడు) దెందుకూరి సూర్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



ఇరగవరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి జగనన్న ధ్యేయమని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఇరగవరం మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్ల మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండలంలో 506 కొత్త పింఛన్లు అందిచడం జరుగుతుందన్నారు. మీకు రావలసిన డబ్బును చంద్రబాబు దోచుకున్నాడని ఆరోపించారు. చంద్రబాబు మాటలను ప్రజలు సమ్మోస్థితిలో లేరన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తుంటే ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం తథ్యమన్నారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్ చూపించి అందులో అందించే వైద్య సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఎంపీపీ అలివేలు మంగ తాయారు, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, ఏపీపీ వెలగల సాయిబాబా రెడ్డి, పులుపు అనిల్, పులుపు అక్కమాంబ, కె ఇల్లిందలపర్రు సొసైటి అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున, ఎంపీడీవో ఎ శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, లబ్ధిధారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయండి



పెంటపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రికార్డులను తనిఖీ చేస్తున్న దృశ్యం

పెంటపాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పీహెచ్‌సీలో సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి. మహేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పెంటపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ప్రభుత్వాసుపత్రులలో కాన్పుల సంఖ్యను గణనీయంగా పెంచాలని, తల్లీబిడ్డల ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు కచ్చితంగా పాటించాలన్నారు. ఆసుపత్రి పరిసరాలు, లాబ్‌ను, రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు తోట రాజేష్, వి. మౌనిక, సీహెచ్‌వో సుజాత, హెచ్ఎస్ సత్యనారాయణ, ఎల్‌టీ రాజా, మీసాల సాయిబాబా, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలే శ్రేష్టమైనవి



మట్టి విగ్రహాలను తయారుచేసిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

అత్తిలి: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలే శ్రేష్టమైనవని బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌సీఎం దత్ చెప్పారు. పర్యావరణ పరిరక్షణ అవగాహనలో భాగంగా శుక్రవారం అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల సైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు వినాయక చవితిని పురస్కరించుకుని మట్టితో వినాయక ప్రతిమలను తయారు చేసి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు వినాయకుని మట్టి విగ్రహాలను తయారీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సైన్సు ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి, ప్రసాద్, మల్లేశ్వరరావు, ఎస్ పురుషోత్తం, శ్రీనివాసరావు, హర్షద్, మాధవ్ పాల్గొన్నారు.

రజక చెరువుల లీజును తగ్గించాలి



డీపీవోకు రజక చెరువుల విషయంలో వినతిపత్రం ఇస్తున్న రజక సంఘం నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెంలో మండలం మాధవరం గ్రామంలో రజక చెరువుల లీజును మూడేళ్ల కాలపరిమితికి 21వేల నుంచి70వేలకు పెంచారని, దీన్ని తగ్గించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజకసంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్టయ్య కోరారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయానికి విచ్చేసిన జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై డీపీఓ స్పందిస్తూ రజక చెరువులు విషయంలో ప్రభుత్వ జీఓ ఆధారంగా ఎవరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రజక నేతలు వి.శ్రీనివాసరావు, కొమ్మంటి మురళీ లక్ష్మీ ప్రసన్న, కడలి సుబ్బయ్య, అవిటి సత్యనారాయణ, అయినవల్లి అప్పలరాజు, కళింగపట్నం నాగేశ్వరరావు, టేకు ధనరాజు, నాగయ్య, మాధవరం నాయకులు పాల్గొన్నారు.

మినుము పంటలో యాజమాన్య పద్ధతులపై శిక్షణ



రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెంలో రూరల్ గ్రామాలైన నీలాద్రిపురం, పట్టింపాలెం గ్రామాల్లో రైతులకు మినుము పంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రం ఉండి వారిచే రైతు భరోసా కేంద్రం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. .ఈ సందర్భంగా డాక్టర్ ఎం.భరతలక్ష్మీ మాట్లాడుతూ రైతులు వరిలో నూతన వంగడాలు, స్వల్పకాలిక రకాలపై దృష్టి సారించాలని తెలిపారు. రైతులు సాధ్యమైనంత వరకు సంవత్సరానికి మూడు పంటలుగా వరి, అపరాలు, వరి పద్ధతిని అనుసరిస్తే లాభదాయకంగా ఉంటుందని వెల్లడించారు. అంతేగాక రైతులు రబీ వరి కోత అనంతరం జనుమును వరి మాగాణుల్లో సాగు చేయడం ద్వారా భూసారం పెంపొందించవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు రజిత, మండల వ్యవసాయ అధికారి ఆర్ఎస్.ప్రసాద్, కుసుమాకర్, వంశీ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మైనారిటీలకు అండగా సీఎం జగన్

తణుకు నియోజకవర్గ మహిళా కమిటీ సమావేశంలో మంత్రి కారుమూరి



తణుకు నియోజకవర్గ మైనారిటీ సెల్ నూతన కమిటీతో మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికీ వైఎస్సార్‌సీపీ అండగా నిలబడుతుందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం తణుకు నియోజకవర్గ మైనారిటీ సెల్ నూతన మహిళా కమిటీని మంత్రి కారుమూరి ప్రకటించారు. మైనారిటీలకు అండగా నిలబడిన మొట్టమొదటి వ్యక్తి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి అయితే, వారికి సంక్షేమం అందించి ఆర్థికంగా ఆదుకున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని అన్నారు. పార్టీ కోసం కష్టపడే వారందరికీ మంచి స్థానాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి ఆధ్వర్యంలో మైనారిటీ మహిళలకు పూలమాలలు వేసి సత్కరించారు. అనంతరం మైనారిటీలంతా తాము అంకిత భావంతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

నూతన కమిటీ వీరే..

తణుకు నియోజకవర్గ మైనారిటీ సెల్ నూతన కమి టీని మంత్రి కారుమూరి శుక్రవారం ప్రకటించారు. అధ్యక్షురాలిగా షేక్ ఫహీమా అన్వర్, ఉపాధ్యక్షురాలిగా షేక్ హబీబున్నిసా, షేక్ మంతాజ్‌బేగం, షేక్ జరీనా, సయ్యద్ ఉస్మా అహ్మద్ బేగం, కార్యదర్శులుగా షేక్ ఖమర్ జహ, షేక్ మస్తాన్ బీబీ, షేక్ నూర్జహాన్, ఎండీ రిజ్వానాలతోపాటు 13 మందిని సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్య క్షుడు మంగెన సూర్య, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, ఏఎంసీ వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్, షేక్ సలీం, కుడుపూడి చంద్రరావు, తాటిపర్తి వాసు పాల్గొన్నారు.

గురుపూజోత్సవానికి మంత్రి కారుమూరికి ఆహ్వానం

తణుకు అర్బన్: రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును ఈనెల 17వ తేదీన తణుకులో నిర్వహించే జిల్లా స్థాయి ఉపాధ్యాయుల గురుపూజోత్సవం కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) నాయకులు కోరారు. తణుకు బ్యాంక్ కాలనీలోని క్షత్రియ కల్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ గురుపూజోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాల్సిందిగా ఆహ్వానపత్రిక అందచేశారు. తప్పనిసరిగా హాజరవుతానని మంత్రి కారుమూరి చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాలల అసోసియేషన్ నాయకులు ప్రగతి రాజా, అపుస్మా నాయకులు బి.విద్యాకాంత్, పెన్మెత్స రామరాజు, నాసరి రాజశేఖర్, వీఎస్‌వీ కొండలరావు, ఎల్‌కే త్రిపాఠి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రత్తిపాడులో గడపగడపకు మన ప్రభుత్వం

పెంటపాడు: మండలం ప్రత్తిపాడు గ్రామంలో శనివారం సాయంత్రం గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కై గాల శ్రీనివాస్, పార్టీ నాయకులు వీర్ల గోవిందులు ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యా సంస్కరణలతో రాష్ట్రం ముందంజ



జాబ్ మేళాలో ఎంపికైన విద్యార్థులకు పత్రాలు అందజేస్తున్న మంత్రి కారుమూరి, కమిషనర్ భాస్కర్

తణుకు టౌన్: రాష్ట్రంలో అమలవుతున్న విద్యా సంస్కరణల పట్ల దేశం యావత్తు మన రాష్ట్రం వైపు చూస్తోందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోదారుల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు చెప్పారు. శుక్రవారం తణుకు డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళా కార్యక్రమంలో మంత్రి కారుమూరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అనిల్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో విద్యాసూచికలు రాష్ట్రం జాతీయ స్థాయిలో 15వ స్థానంలో ఉండగా ప్రస్తుతం మూడో స్థానంలో ఉందన్నారు. విద్యారంగంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న మార్పులు కారణంగా పేద పిల్లలకు ఇంగ్లీషు మీడియం నుంచి నాడు నేడు పాఠశాలల అభివృద్ధి వరకు మొత్తం రూ. 67 వేల కోట్లు వరకు ఖర్చు చేయడం జరిగిందన్నారు. సంస్కరణలు ఫలితంగా రాష్ట్ర జీడీపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్ మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం అనుసరించి రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు దేశానికి ఆదర్శంగా ఉన్నాయన్నారు. తణుకులో నిర్వహించిన జాబ్ మేళాలో 2006 మంది హాజరు కాగా 550 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు చెప్పారు. తణుకు కళాశాల నాక్ ఏ గ్రేడ్ సాధించిందన్నారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ గుబ్బల తమ్మయ్య, ఆర్జేడీ డాక్టర్ సీహెచ్ కృష్ణ, అకడమిక్ గైడెన్స్ డాక్టర్ సీహెచ్ తులసి, కళాశాల విద్యా ఓఎస్‌డీ డాక్టర్ కె.కవిత, జేకేసీ చీఫ్ కోఆర్డినేటర్ ఎ.రామ్‌గోపాల్, కళాశాల సీపీడీసీ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



పెంటపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది

పెంటపాడు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని జిల్లా వైద్యాధికారి మహేశ్వరరా వు, పీడీ సుజాత రాణిలు తెలిపారు. పెంటపాడు గ్రామంలో పౌష్టికాహార మాసోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ నుంచి ఎస్‌టీవీఎస్ హైస్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోషణపై ప్రజలకు అవగాహన కల్పించారు. రక్తహీనత నివాణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో టీఎల్ సరస్వతి, గ్రామ సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, సూపర్‌వైజర్‌లు దుర్గాభవాని, జీజీబీ విజయలక్ష్మి, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

తాడేపల్లిగూడెం (టీఓసీ): గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని డాక్టర్ రూపాదేవి అన్నారు. తాడేపల్లిగూడెం ఐసీడీఎస్ పరిధిలో చినతాడేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవము సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. . ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని శుక్రవారం స్థానిక 28వ వార్డులో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పౌష్టికాహారాన్ని అందించాలి

ఇరగవరం: గ్రామాల్లో అర్హులందరినీ గుర్తించి పౌష్టికాహారాన్ని అందించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్లు మాణిక్యాంబ, కాంత కుమారి, నాగ లక్ష్మీ తెలిపారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శక్రవారం మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించారు. బాలింతలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న గృహాలు త్వరగా పూర్తి చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సబ్ డివిజన్ కార్యాలయాన్ని జిల్లా హౌసింగ్ అధికారి డాక్టర్ ఆర్‌సీ ఆనందకుమార్ శుక్రవారం సందర్శించారు. అధికారులతో గృహ ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఇంజనీర్స్‌డే నిర్వహించారు. గృహ నిర్మాణ సంస్థ ఈఈ వి.వేణుగోపాల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ధర్మలను మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా సన్మానించారు. పట్టణంలోను, పెంటపాడు మండలంలోన జగనన్న కాలనీలను సందర్శించి క్షేత్రస్థాయి సిబ్బందికి సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయక ఇంజనీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్య సేవలు మరువలేనివి



నిట్ ప్రొఫెసర్‌లను సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సభ్యులు



అత్తిలిలో ఇంజనీర్స్‌డే సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అత్తిలి: ఇంజనీర్స్ డే వేడుకను అత్తిలి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తాడేపల్లిగూడెం ఎలక్ట్రికల్ డీఈ నరహరిశెట్టి వెంకటేశ్వరరావు, ఇంజనీర్ కె వెంకట సత్యనారాయణలను సన్మానించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఆయన దేశానికి అందించిన సేవలను పలువురు వక్తలు శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శింగులూరి చంద్రశేఖర్, సెక్రటరీ ఎస్ వెంకట నారాయణ, కోశాధి కారి నాగేశ్వరరావు లయన్స్‌క్లబ్ సభ్యులు పట్నాల సత్యవాణి, యాతం సుజాత, దాసం బాబ్జి, ఉలుసు భాస్కరరావు, పట్నాల వెంకటేశ్వరరావు, సంకు బాబూ రావు, దొండమూరి వెంకటేశ్వరరావు, ఆర్ సుబ్బరాజు, టి జయసూర్య, ఎస్ సూరిబాబు, శింగంశెట్టి హరిశ్చంద్రప్రసాద్, ప్రవీణ్‌రావు, బండి శ్రీను, పి సోమయ్య, యాతం రాంబాబు, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్య సేవలు అమోఘం

తాడేపల్లిగూడెం అర్బన్ : మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి అందించిన సేవలు మరువలేనివని నేటి ఇంజనీరు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని శ్రీ బలుసులమ్మ అమ్మవారి కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో కొట్టు మాట్లాడుతూ భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజనీరు వృత్తికి తలమానికమన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మంత్రి కొట్టు, కలెక్టర్ ప్రశాంతి నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర గణనీయమైందన్నారు. ఇంజినీర్ల దినోత్సవం సందర్భంగా ఉద్యోగులను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పల శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఇంజినీర్లును ఘనంగా సత్కరించారు. వారికి జ్ఞాపికలను అందచేశారు.

ఘనంగా ఇంజనీర్స్‌డే వేడుకలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం అధ్యక్షుడు వంగపండు రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో నేషనల్ ఇంజనీర్స్ డేను శుక్రవారం ఘనంగా పట్టణంలో క్లబ్ హాల్‌లో నిర్వహించారు. నిట్ ఏపీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫణి కృష్ణ, ఇంజనీర్స్ డాక్టర్ నగేష్ బట్టు శ్రేష్టి, డాక్టర్ కార్తీక్ శేషాద్రి, డాక్టర్ శంకర్ పెద్దపాటి, డాక్టర్ కార్తికేయ శర్మ, కేఎస్‌వి రజనీష్‌లకు అవార్డులు అందజేశారు. శానం రామకృష్ణ, చిన్నం జగదీష్, జీడిగుంట హరిబాబు, సన్నిధి సూర్యనారాయణమూర్తి, బాపయ్య శర్మ, సుంకర శ్రీనివాస్, కె.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

డైమండ్స్ ఆధ్వర్యంలో....

ఇంజనీర్లు పాత్ర ప్రపంచంలోనే కీలకమని జిల్లా అర్ అండ్ బి (భీమవరం) అధికారి ఎస్.లోకేశ్వరరావు అన్నారు. డైమండ్స్ అధ్యక్షులు కొప్పిశెట్టి రమణయ్య ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ఆర్ అండ్ బి కార్యాలయం వద్ద ఇంజనీర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాస్‌రావు, గూడెం ఫైర్ అధికారి గణేశ్న వెంకట రామారావు, కె.గోపికృష్ణ, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో

మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. విశ్వేశ్వరయ్య జీవిత విశేషాలను ఈ సందర్భంగా విద్యార్థులకు వెల్లడించారు. ప్రిన్సిపాల్ రమణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



ఒత్తిడిని వదిలేయండి ఇలా...

ఉదయం లేచినప్పటి నుంచి ఉరుకులు పరుగులు మొదలు. చేయాల్సిన పనుల చిట్టా చాంతాడంత. దీంతో హడావుడి, ఆందోళన. ఫలితం ఒత్తిడి. అందుకనే ఈ రోజుల్లో ఎక్కువ శాతం మంది ప్రజలు ఒత్తిడికి గురవుతున్నారు. ఆందోళనతో చిత్తవుతున్నారు. వీటి వల్ల వచ్చే శారీరక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. మరి ఈ ఒత్తిడిని తగ్గించుకుంటే చాలా అనారోగ్య సమస్యల నుంచి బయట పడొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. అందుకు ఇంట్లో మనంతట మనం పాటించగల చిన్న చిట్కాలను చెబుతున్నారు. అవేంటో చూద్దామా..?

గోరు వెచ్చని లేదా చల్లని నీటితో స్నానం చేయడం చాలా మంచిది. శరీరంలో ఎక్కడైనా నొప్పులుగా అనిపిస్తే చిన్నగా మసాజ్ చేసుకోవడం, కండరాలన్నీ సాగేలా ఒళ్లు విరుచుకోవడం లాంటి పనుల వల్ల ఒత్తిడి తగ్గుతుంది. బాత్ రూమ్‌లో కూనిరాగాలు తీయడం లేదా ఏదైనా లైట్ మ్యూజిక్‌ని పెట్టుకుని, గోరువెచ్చని నీటితో శరీరం, మనస్సు తేలిక పడేంతవరకు టబ్ బాత్ చేయాలి. అందుకు మంచి సువాసన ఉన్నసహజమైన సబ్బును ఉపయోగించాలి. ఇలా చేయడం వల్ల ఒత్తిడి నుంచి కాస్త ఉపశమనం లభిస్తుంది.

నృత్యం...

నృత్యం చేయడం అనేది ఒత్తిడి నివారిణిలా పని చేస్తుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. మంచి సంగీతాన్ని పెట్టుకుని దానికి తగినట్లుగా డ్యాన్స్ చేయవచ్చు. ఎవరైనా ఉన్నప్పుడు చేయడం మొహమాటం అయితే ఎవరూ లేనప్పుడు ఆ పని చేయండి. దీనివల్ల మనసుకు ఆనందం కలుగుతుంది. ఒత్తిడి హార్మోన్ల స్థాయి తగ్గుతుంది.

ఇష్టమైన వారితో ప్రేమగా...

ఎక్కువ ఒత్తిడిలో ఉన్నప్పుడు ఇష్టమైన వారితో ప్రేమగా... సంతోషంగా గడిపేందుకు ప్రయత్నించండి. అందువల్ల శరీరంలో డోపమైన్ లాంటి హ్యాపీ హార్మోన్‌లు విడుదలవుతాయి. దీంతో మీరు ఒత్తిడి నుంచి బయటపడే అవకాశం ఉంటుంది.



ధ్యానం...

ఒత్తిడి నుంచి బయట పడటానికి ధ్యానం అద్భుతమైన మార్గం అని చాలా అధ్యయనాల్లో తేలింది. శ్వాస మీద ధ్యాస పెట్టి కేవలం రెండు నిమిషాలు కళ్లు మూసుకున్నా సరే అది మీ శరీరంలో స్ట్రెస్ హార్మోన్ సార్టిసాల్ స్థాయుల్ని తగ్గిస్తుంది.

బబుల్ ర్యాప్‌లను పగలగొట్టడం...

బబుల్ ర్యాప్ కవర్లను చూడగానే అంతా వాటిని పగలగొట్టాలని ఉవ్విళ్లూరతారు. అందుకు కారణాలు లేకపోలేదు. అలా వాటిని పేల్చడం వల్ల మనలో ఓ రకమైన ఆనందం కలుగుతుంది. ఒత్తిడి దూరమవుతుంది. అందువల్లనే మనం వాటిని పేల్చేందుకు ఇష్టపడుతుంటాం.

మంచి పుస్తకాలు చదవడం...

మంచి పుస్తకాలు, పేపర్లు చదవడం ద్వారా కూడా ఒత్తిడి నుంచి బయటపడవచ్చు. ఒత్తిడిగా అనిపించినప్పుడు మీకు నచ్చిన పుస్తకం తీసి చదవండి. వెంటనే తగ్గుముఖం పడుతుంది ఆ ఒత్తిడి. అలాగే రోజూ దినపత్రికలను చదవడం కూడా ఒత్తిడి నివారణలో ఒక భాగం. దినపత్రికలు చదవడమనగానే నేరవార్తలు, హత్యావార్తలు కాదు. మనసుకు కాస్తంత ఆహ్లాదం కలిగించే వార్తలు చదవడం మేలు.

ఆలయ సందర్శనం...

మీ మతాన్ని అనుసరించి మీరు ప్రార్థనామందిరాలను సందర్శించడం మంచిది. రోజూ కాసేపు పూజామందిరంలో గడపడం వల్ల మనసుకు ప్రశాంతత చేకూరుతుంది. అలాగని దేనినీ అతిగా చేయరాదు. గంటలు గంటలు పూజలు చేస్తూ గడపడం కూడా మంచిది కాదు. క్రమం తప్పకుండా ఆలయానికి లేదా మసీద్‌కు లేదా చర్చికి వెళ్లడం వల్ల ఒత్తిడి దూరం అవుతుంది.

మీరు ఒత్తిడిలో ఉన్నారు అనుకున్నప్పుడువీటిలో మీకు వీలైనవాటిని పాటించి చూడండి.

అన్నింటికన్నా ముఖ్యం ఒత్తిడి వచ్చాక బాధ పడేకంటే ఒత్తిడికి గురికాకుండా చూసుకోవడం చాలా ఉత్తమం. అదేవిధంగా ఒత్తిడి ఎందువల్ల వస్తుందో తెలుసుకుంటే నివారించుకోవడం సులభం కాబట్టి, ముందుగా మీ పనులను ప్రశాంతగా పూర్తి చేయడం ఆరంభించండి.

ఆహారానికి సుగంధం ఆరోగ్యానికి అందలం



ఆహారం సులభంగా జీర్ణమవడానికి ఆహారంలో కొన్ని సుగంధ ద్రవ్యాలను చేర్చుకుంటే మేలు. అవేంటో, ఎలా పనిచేస్తాయో తెలుసుకుందాం... జీర్ణశక్తి బాగుంటే ఆరోగ్యం బాగున్నట్లే. మనం తీసుకునే ఆహారం మీదనే అది జీర్ణమవడం ఆధారపడి ఉంటుంది. మన వంటిళ్లలో సహజంగానే జీర్ణశక్తిని పెంచే సుగంధ ద్రవ్యాలు బోలెడుంటాయి. అలాంటి వాటిలో తేలికగా అందుబాటులో ఉండే పదార్థాలే ఎక్కువ. వాటిని వాడటం ద్వారా జీర్ణశక్తి ఎలా మెరుగవుతుందో చూద్దాం...



అల్లం...

దీర్ఘకాలిక అజీర్తి సమస్యలు ఉన్న వాళ్లకి అల్లం మంచి మందు. ఇది కడుపు నొప్పి రాకుండా చేస్తుంది. అల్లం టీ తాగడం, వండుకునే ఆహార పదార్థాల్లో కొంచెం అల్లాన్ని చేర్చడం ద్వారా ఆహారం తేలికగా జీర్ణం అవుతుంది. కడుపు ఖాళీ అవడానికీ ఇది సహకరిస్తుంది.



ధనియాలు...

కడుపు ఉబ్బరంగా, వికారంగా ఉన్నప్పుడు కాసిని ధనియాలు నీటిలో వేసి మరిగించి తాగడం వల్ల ఉపశమనం కలుగుతుంది. ధనియాల్లో ఉండే కొన్ని లక్షణాల వల్ల గ్యాస్ సమస్యలు దూరం అవుతాయి.



యాలకులు...

కడుపులో మంట, నొప్పి, వికారం లాంటి వాటికి యాలకులు మంచి మందులా పని చేస్తాయి. దీంట్లో మాంగనీసు ఎక్కువగా ఉంటుంది. ఇది తిన్న ఆహారం అరిగి శక్తినిచ్చేలా చేస్తుంది. మధుమేహం నుంచి కాపాడుతుంది.



మెంతులు...

నానబెట్టిన మెంతుల్ని ఖాళీ కడుపుతో తినడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు తగ్గుతాయి. అజీర్తి, మలబద్ధకం లాంటి వాటికి పరిష్కారం దొరుకుతుంది. పేగుల ఆరోగ్యం బాగుంటుంది.



సోంపు...

ఆహారం తేలిగ్గా జీర్ణం కావడానికి సోంపు చాలా మంచిది. ఇంట్లో కూడా తిన్న వెంటనే కొన్ని సోంపు గింజలు నమిలితే దీనిలో ఉండే పొటాషియం, జింక్, మాంగనీసు, ఐరన్, కాపర్ లాంటి ఖనిజాలు జీర్ణ వ్యవస్థ సక్రమంగా పనిజేయడంలో సహకరిస్తాయి.



జీలకర్ర...

జీలకర్రలో మెగ్నీషియం, కాల్షియం, ఐరన్, పాస్ఫరస్ సమృద్ధిగా ఉంటాయి. ఇంకా విటమిన్ ఎ, సి, కె, ఇ, బీ 6 కూడా ఉంటాయి. రోజూ టీ స్పూను జీలకర్ర తీసుకోవడం వల్ల ఈ పోషకాలన్నీ శరీరానికి అందుతాయి. పేగుల్లో పేరుకుపోయిన మలినాలను తొలగించడంలో ఇది సహకరిస్తుంది. దీన్ని భోజనానికి ముందు తీసుకుంటే డైజెస్టివ్ ఎంజైమ్స్‌ని ప్రేరేపిస్తుంది. జీర్ణక్రియలో సహకరిస్తుంది.

అందువల్ల ఈ సుగంధ ద్రవ్యాలను తప్పకుండా తీసుకోవాలి.

హెల్త్ టిప్స్



- ఉసిరి పచ్చడి తీసుకోవడం, తేనెలో నాన పెట్టిన ఉసిరిని నిత్యం పద్ధతి ప్రకారం సేవించడం ద్వారా దృష్టిలోపం తగ్గుతుంది. ఉసిరి పొడిని నిత్యం పరకడుపున తేనెతో కలిపి సేవించడం వల్ల వత్తిడి, అలసట తగ్గుతుంది.



- ఎండు ద్రాక్షలు లేదా కిస్‌మిస్‌లు వాడడం మంచిది. వీటికి చలువ చేసే గుణం వుంది. గ్లాసుడు నీళ్లలో ఎండు ద్రాక్షలు వేసి, నాన పెట్టి, ఆ నీటిని తీసుకుంటే వేడి చేయకుండా ఉంటుంది. ముఖ్యంగా పిల్లలకు చాలా మంచిది.



- గోధుమలు, బియ్యం, పెసలు, రాగులు, సోయాగింజ లు, జొన్నలు అరకిలో వంతున కలిపి, 50 గ్రాముల నువ్వులు, 20 గ్రాముల జీలకర్ర జోడించి, దోరగా విడివిడిగా వేయించాలి. ఆపై మరపట్టించి రొట్టెలు చేసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిది. ఈ పిండితో జావ కూడా చేసుకోవచ్చు.



- నెలసరి నొప్పితో బాధపడేవారు పుదీనా ఆకులను నీళ్లలో వేసి మరిగించి, వడ కట్టి, ఆ నీటిని సేవించడం వల్ల మంచి ఫలితం వుంటుంది. పుదీనా ఆకులు, ఉప్పు కలిపి నీటిలో మరిగించి, ఆ ఆవిరి పడితే గొంతు మృదువుగా మారుతుంది.

సడెన్‌గా చెమటలా..?

చెమటలు పట్టడం అనేది చాలా సాధారణ విషయం.. ఎందుకంటే శరీర శ్రమ అతిగా చేయడం వల్ల అందరిలో చెమట పడుతూ ఉంటుంది. ముఖ్యంగా వేసవిలో మరింత సహజం. అయితే కొందరిలో చెమట విచ్చలవిడిగా పడుతూ ఉంటుంది. దీంతోపాటు కొందరిలో అకస్మాత్తుగా చెమటలు పోస్తాయి. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు చాలామంది దీనిని సాధారణ సమస్యగా భావించి తేలిగ్గా తీసుకుంటున్నారు. దీని వల్ల భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలని కొని తెచ్చుకున్నట్లేనని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇలా మీకు జరుగుతుంటే మాత్రం మీ ఒంటి మీద మీరు కాస్తంత శ్రద్ధ తీసుకోవాల్సిందే మరి!



అకస్మాత్తుగా చెమటలు పట్టడం అనేకరకాల అనారోగ్య సమస్యలకు ముందస్తు సూచనలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీనిని గుండెజబ్బుల లక్షణాలలో ఒకటిగా వైద్యులు భావిస్తారు. తీవ్ర అనారోగ్య సమస్యలు వచ్చే ముందు తరచు ఆకస్మాత్తుగా చెమటలు పడతాయని నిపుణులు చెబుతున్నారు. మీలో ఇలాంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించడం, వారి సలహా మేరకు హెల్త్‌చెకప్ చేయించుకోవడం మంచిదని అనుభవజ్ఞుల సలహా.

అధిక చెమట ఈ వ్యాధుల లక్షణాలలో ఒకటి...

అకస్మాత్తుగా చెమటలు పట్టడం గుండెపోటు మొదటి లక్షణమని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. మహిళలకు రాత్రిపూట ఎక్కువగా చెమట పడడం వల్ల భవిష్యత్‌లో రానున్న తీవ్రసమస్యలకు సంకేతాలు. తీవ్ర దీర్ఘకాలిక వ్యాధుల కారణంగా కూడా ఎక్కువగా చెమట పడుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా కొంతమందిలో మధుమేహం పెరగడం కారణంగా కూడా ఇలాంటి సమస్యలు వస్తాయి.

● అకస్మాత్తుగా వచ్చే చెమటలు రాకుండా ఉండాలంటే... ఆహారంలో ఉప్పు వాడకాన్ని తగ్గించడం ● మద్యపానం అలవాటుంటే వెంటనే మానేయడం ● ఆకు కూరలు, పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారాలు తీసుకోవడం ● గ్రీన్ టీ తీసుకోవడం ● రోజుకు కనీసం మూడు లీటర్ల నీటిని తాగడం ● డీప్ ఫ్రైలు, ఇతర నూనె పదార్థాలను తగ్గించడం ● ప్రతి రోజూ తేలికపాటి వ్యాయామాలు చేయడం ● పద్ధతి ప్రకారం డైట్ తీసుకోవడం అవసరం.

సినిమా

మీ ఆనందమే నాకు సంతృప్తి



- విజయ్ దేవరకొండ

"నేను చదువుకునే రోజుల్లో ఫ్రెండ్స్ అంతా విహార యాత్రకు వెళ్తే నేను ఇంట్లో డబ్బులు అడిగి ఇబ్బందిపెట్టడం ఇష్టం లేక అలాగే ఉండిపోయేవాడిని. ఆ విహార యాత్రలో నా స్నేహితులు ఎలా ఎంజాయ్ చేస్తున్నారో అని ఆలోచిస్తూ ఉండేవాడిని. తమ్ముడి (ఆనంద్ దేవరకొండ) ఇంజినీరింగ్ ఫీజు కోసం ఇబ్బంది పడుతున్నప్పుడు ఎవరైనా కొంత సహాయం చేస్తే బాగుండును అనిపించేది. కానీ ఎవర్నీ అడగడానికి ఇష్టం ఉండేది కాదు. అవన్నీ దాటుకుని ఈ స్థాయికి చేరుకున్నాను. ఇవాళ మీకు (అభిమానులు) హెల్ప్ చేయగలుగుతున్నాను అంటే అది నా వ్యక్తిగత ఆకాంక్ష. నేను అందించే ఈ లక్ష రూపాయలతో మీకు ఒత్తిడి తగ్గి ఆనందం కలిగితే అది నాకు సంతృప్తిగా ఉంటుంది'' అన్నారు విజయ్ దేవరకొండ. శివ నిర్వాణ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన చిత్రం 'ఖుషి'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్‌లు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 1న విడుదలైంది. 'ఖుషి' సినిమా హ్యాపీనెస్‌ను షేర్ చేసేందుకు ఎంపిక చేసిన 100 లక్కీ ఫ్యామిలీస్‌కు రూ. లక్ష చొప్పున చెక్స్ అందించారు విజయ్ దేవరకొండ. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ– ''ఈ ప్రోగ్రామ్‌ను అనౌన్స్ చేసినప్పటి నుంచి మాకు ఇప్పటివరకూ 50 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. అయితే ఈ ఏడాది వంద మందికి మాత్రమే సహాయం చేయగలుగుతున్నాం. ప్రతి ఏడాది కొంతమందికి సహాయం చేస్తూనే ఉంటాను. నేను స్ట్రాంగ్‌గా ఉన్నంతవరకూ, సినిమాలు చేస్తున్నంతవరకూ నేను సహాయం చేస్తూనే ఉంటాను. మీరు నాపై చూపిస్తున్న ప్రేమకు థ్యాంక్స్'' అన్నారు. ''కేవలం తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక, సౌత్ స్టేట్స్ నుంచి సెలెక్ట్ చేశారు. సౌత్‌లో అన్ని ప్లేసెస్ నుంచి మా సినిమాకు మంచి స్పందన లభించింది'' అన్నారు శివ నిర్వాణ. ''వంద మందికి సహాయం చేయాలనే ప్రయత్నం మా మూవీతో విజయ్ మొదలుపెట్టినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు నవీన్, రవిశంకర్.

కోలీవుడ్ కబురు?

దివంగత నటి శ్రీదేవి చిన్న కుమార్తె ఖుషీ కపూర్‌కు కోలీవుడ్ నుంచి కబురు వెళ్లిందట. తమిళ నటుడు అథర్వ హీరోగా ఆకాష్ అనే కొత్త దర్శకుడు ఓ తమిళ చిత్రాన్ని తెరకెక్కించనున్నారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు ఖుషీ కపూర్‌ను సంప్రదించిందట చిత్ర యూనిట్. ఖుషీకి ఈ కథ నచ్చిందని, ఆమె దాదాపు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నది కోలీవుడ్ సినీ సర్కిల్స్‌లో వినిపిస్తున్న మాట. ఒకవేళ ఇదే నిజమైతే.. ఖుషీ కపూర్ నటించే తొలి తమిళ సినిమా ఇదే అవుతుంది. ఈ సంగతి ఇలా ఉంచితే.. 'పయ్యా ('ఆవారా')' సినిమాకు సీక్వెల్‌గా 'పయ్యా 2' రానుందని, ఇందులో ఆర్య హీరోగా నటిస్తారని, ఖుషీ కపూర్ హీరోయిన్‌గా ఎంపికయ్యారనే టాక్ గతంలో కోలీవుడ్‌లో వినిపించింది. అయితే 'పయ్యా 2' సీక్వెల్‌లో ఖుషీ కపూర్ నటిస్తుందనే వార్తల్లో వాస్తవం లేదని ఆమె తండ్రి, నిర్మాత బోనీ కపూర్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఇక హిందీలో 'ఆ ర్చీస్' అనే వెబ్ ఫిల్మ్‌లో ఖుషీ కపూర్ నటిస్తున్నారు. ఈ చిత్రం నవంబర్ నుంచి స్ట్రీమింగ్ కానుందని సమాచారం.



ఖుషీ కపూర్

సప్త సాగరాలు

రక్షిత్ శెట్టి హీరోగా నటించి, నిర్మించిన కన్నడ చిత్రం 'సప్త సాగర దాచే ఎల్లో'. హేమంత్ ఎం. రావు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించారు. ఈ నెల 1న కన్నడలో విడుదలైన ఈ చిత్రం హిట్‌గా నిలిచింది. ఈ సినిమాని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, రక్షిత్ శెట్టి కలిసి 'సప్త సాగరాలు దాటి' అనే పేరుతో ఈ నెల 22న తెలుగులో విడుదల చేయనున్నారు. ''క్లాసిక్ లవ్ స్టోరీగా రూపొందిన చిత్రమిది. కన్నడలో సూపర్ హిట్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం తెలుగులోనూ సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు టీజీ విశ్వప్రసాద్. ఈ చిత్రానికి సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.



రక్షిత్, రుక్మిణి



మృణాల్ ఠాకూర్

ప్రేమకథ విన్నారా?

కెరీర్‌లో హీరోయిన్‌గా మంచి ఫామ్‌లో ఉన్నారు మృణాళ్ ఠాకూర్. నార్త్ అండ్ సౌత్ అనే తేడాలను పక్కన పెడితే ఈ బ్యూటీ హీరోయిన్‌గా నటించిన ఐదు సినిమాలు రిలీజ్‌కు రెడీ అవుతున్నాయంటే ఆమె ఏ స్పీడ్‌తో దూసుకెళ్తున్నారో ఊహించవచ్చు. ఇదే స్పీడ్‌ను కొనసాగించాలనుకుంటూ బాలీవుడ్ కొత్త సినిమాకు సై అన్నారట మృణాళ్. శ్రీదేవి టైటిల్ రోల్ చేసిన హిందీ హిట్ ఫిల్మ్ 'మామ్' తీసిన దర్శకుడు రవి ఉడయార్ ఇటీవల ఓ లవ్‌స్టోరీ స్క్రిప్ట్‌ను రెడీ చేసుకున్నారట. ఆయన ఈ కథను మృణాళ్‌కు వినిపించగా, ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని బాలీవుడ్ సమాచారం. సిద్ధార్థ్ చతుర్వేది హీరోగా నటించనున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ వచ్చే ఏడాది ప్రారంభం కానుందని బీ టౌన్ టాక్.

ఆ రోజు కీడా కోలా



బ్రహ్మానందం

'పెళ్ళిచూపులు', 'ఈ నగరానికి ఏమైంది?' చిత్రాల ఫేమ్ దర్శకుడు తరుణ్ భాస్కర్ నటించి, తెరకెక్కించిన తాజా చిత్రం 'కీడా కోలా'. క్రైమ్ కామెడీ జానర్‌లో రూపొందిన ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ మూవీలో బ్రహ్మానందం, రఘురామ్, రవీంద్ర విజయ్ లీడ్ రోల్స్ చేశారు. కె.వివేక్ సుధాంషు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్, శ్రీపాద్ నందిరాజ్, ఉపేంద్ర వర్మ ఈ సినిమాను నిర్మించారు. కాగా ఈ సినిమా నటుడు–నిర్మాత రానా సమర్పణలో నవంబరు 3న విడుదల కానున్నట్లుగా చిత్ర యూనిట్ శుక్రవారం అధికారికంగా వెల్లడించింది. ఈ సినిమాకు సంగీతం: వివేక్ సాగర్.

భయం.. అత్యాశ.. కుట్ర



వంశీ, ఆనంద్ దేవరకొండ, ఉదయ్, అనురాగ్

ఆనంద్ దేవరకొండ హీరోగా ఉదయ్ శెట్టి దర్శకత్వం వహించిన చిత్రం 'గం..గం.. గణేశా'. కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ని రిలీజ్ చేశారు. ఈ వేడుకలో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ– ''భయం, అత్యాశ, కుట్ర అంశాల చుట్టూ ఈ సినిమా కథనం సాగుతుంది. 'బేబీ' తో ఆడియన్స్ ఎంత ఎమోషనల్ అయ్యారో, 'గం..గం..గణేశా' చిత్రంతో అంత ఎంటర్‌టైన్ అవుతారు. ఉదయ్ కథ, విజన్‌ను నమ్మి ఈ సినిమా చేశాను'' అన్నారు. ''ఈ సినిమా విజయంపై మాకు పూర్తి నమ్మకం ఉంది'' అన్నారు వంశీ కారుమంచి. 'ప్రేక్షకులకు నచ్చే చిత్రం ఇది'' అన్నారు ఈ చిత్ర సహనిర్మాత అనురాగ్ పర్వతనేని.

మిస్టర్ ఇడియట్ వస్తున్నాడు

హీరో రవితేజ తమ్ముడు రఘు కుమారుడు మాధవ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'మిస్టర్ ఇడియట్'. సిమ్రాన్ శర్మ హీరోయిన్. గౌరీ రోణంకి దర్శకత్వంలో జేజేఆర్ రవిచంద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. శుక్రవారం మాధవ్ బర్త్ డే. ఈ సందర్భంగా 'మిస్టర్ ఇడియట్' లోని మాధవ్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దర్శక–నిర్మాత కె. రాఘవేంద్ర రావు విడుదల చేశారు. ''మిస్టర్ ఇడియట్' ని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు గౌరీ రోణంకి. ''నవంబరులో ఈ సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు నిర్మాత జేజేఆర్ రవిచంద్.



మాధవ్, సిమ్రాన్ శర్మ

అందాలు చదివే కళ్లకైనా...



పంఖురి, నవదీప్

నవదీప్ హీరోగా నటించిన తాజా చిత్రం 'లవ్ మౌళి'. అవనీంద్ర దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పంఖురి గిద్వానీ, మిర్చి హేమంత్ నటించారు. ప్రశాంత్ రెడ్డి తాటికొండ నిర్మాత. గోవింద్ వసంత సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'అందాలు చదివే కళ్లకైనా.. కందాలు తిరిగే కాళ్లకైనా.. వందేళ్లు కదిలే గుండెకైనా..' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు. అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటను అనిల్ కృష్ణన్ పాడారు. ''లవ్ మౌళి' షూటింగ్ మొత్తం మేఘాలయలోని చిరపుంజీలో చిత్రీకరించాం'' అని యూనిట్ పేర్కొంది.